నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్‌-11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. రామాలయం ఫీడర్ పరిధిలో న్యూ నల్లకుంట, సిండికేట్ బ్యాంక్, నరేంద్రపార్కు, రామాలయం, బతుకమ్మ కుంట ఫీడర్ పరిధిలో పాముల బస్తీ, మల్లన్న టెంపుల్, గంగానగర్, పోచమ్మ బస్తీ తదితర ప్రాంతాల్లో 9.30 నుంచి 11.30 వరకు, డీడీ కాలనీ ఫీడర్ పరిధిలో డీడీ కాలనీ, రామచంద్ర డిగ్రీ కాలేజ్, గ్లాస్ కో, హిల్టెన్ కేఫ్, అయ్యప్ప దేవాలయం ఫీడర్ పరిధిలో సాయి దత్త నర్సింగ్ హోమ్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, శివం, మల్లికార్జుననగర్, ఎరుకల బస్తీ తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి 1.30 వరకు, కమలానగర్ ఫీడర్ పరిధిలో కమలానగర్, కృష్ణానగర్, శంకర్‌నగర్, కృష్ణానగర్ ఫీడర్ పరిధిలో తులసీనగర్, వెంకటేశ్వరనగర్, గంగానగర్, మమూకా మండి తదితర ప్రాంతాల్లో 2.30 నుంచి 4.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



కార్యక్రమంలో పాల్గొన్న చిక్కడపల్లి సీఐ సీతయ్య, కోయ వెంకటేశ్వర్‌రావు తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులంతా శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోయ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని న్యూ ఎరా కళాశాలలో చెకుముకి జిల్లాస్థాయి సైన్స్ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం వృత్తి విద్యకే పరిమితం కాకుండా సైన్స్ వైపు కూడా పయనించాలన్నారు. ప్రశ్నించే తత్వం పెంపొందినప్పుడే విద్యార్థులు ఉన్నతంగా ఎదుగుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. మూఢనమ్మకాలు లేని భారత సమాజ నిర్మాణానికి నేటి విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. చిక్కడపల్లి సీఐ సీతయ్య, చొక్కారపు వెంకటరమణ, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి రాజా, మోహన, నగర నాయకులు లింగస్వామి, మాణిక్యాలరావు, విద్యాసాగర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కాచిగూడ: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్ని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక ఆధ్వర్యంలో సోమవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజక సంఘం ప్రతినిధులు ముత్యాల నర్సింగ్‌రావు, ఓరుగంటి వెంకటయ్యలతో కలిసి మాట్లాడుతూ.. రజకులు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, రజక వృత్తిదారులు నిత్యం అనేక ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. ముఖ్యంగా ఆరోగ్య సమస్యలతో పడుతున్న బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని స్పీకర్ హామీ ఇచ్చారన్నారు.

కండక్టర్‌పై దాడిచేసిన నిందితుల రిమాండ్

చిక్కడపల్లి: ఆర్టీసీ బస్సు కండక్టర్, డ్రైవర్లపై దాడి చేసిన ఇద్దరు నిందితులను దోమలగూడ పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. దోమలగూడ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ట్యాంక్‌బండ్ చిల్డ్రన్ పార్కు వద్ద ఆదివారం ఫారూక్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చంద్రాయణగుట్ట నుంచి రాణిగంజ్ డిపో వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులోని కండక్టర్ రమేష్, డ్రైవర్ షేక్ అబ్దుల్ ఆమీన్‌షాలపై అకారణంగా బోయిన్‌పల్లి నివాసి ఎండీ. మాజీద్(32), తాడ్‌బండ్ నివాసులు మహ్మద్ ఖాసీం(29)లు చిల్డ్రన్ పార్కు, బస్‌స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు ఆగడంతో ఈ ఇద్దరూ ఆకారణంగా గొడవపడి వారి వద్ద ఉన్న క్రికెట్ బ్యాట్‌తో దాడిచేయగా.. కండక్టర్ రమేష్ ఎడమచేయి విరిగింది. డ్రైవర్ షేక్ అబ్దుల్ ఆమీన్‌షాకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న వేములపల్లి వెంకటరామయ్య

ముషీరాబాద్: ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భరత్‌బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ, ఎం.అన్వేష్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.సూర్యం మాట్లా డుతూ.. కేంద్రం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా లక్షలాది కుటుంబాల ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్ర వరి 16న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలని జాయింట్ ప్లాట్‌ఫారమ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్‌లు, సంయుక్త కిసాన్ మోర్చా అఖిల భారత స్థాయిలో నిర్ణయించాయన్నారు. రాష్ట్రంలో కార్మికుల సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను, కార్మికుల పారిశ్రామిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య తెలిపారు. సోమవారం అఖిల భారత రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వెంకటరామయ్య హాజరై మాట్లాడారు. స్వామి నాథన్ కమిషన్ సిఫారస్సు మేరకు రైతులు పండించిన పంటకు ఎంఎస్‌పీ చెల్లిస్తామన్న హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతాంగానికి మోండి చేతి చూపించారని ఆరోపించారు. రూ.11.8 కోట్ల రైతు కుటుంబాలకు ప్రధానమంత్రి సామాన్ నిధి 4 కోట్ల మందికి మాత్రమే అమలైందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, ఎం.డేవిడ్ కుమార్, నందగిరి వెంకటేశ్వర్లు, సురేందర్, ఉమర్, లాల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూర్యం, ఎస్.ఎల్.పద్మ

కానిస్టేబుల్ అభ్యర్థులకు మెడికల్ టెస్ట్



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్

- మొదటి రోజు 79 మందికి మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలు
- ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్

నల్లకుంట: గత ఏడాది నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఆడిటోరియంలో ఆరోగ్య పరీక్షల (మెడికల్ ఫిట్‌నెస్) క్యాంప్ ప్రారంభమైంది. ఈ క్యాంపు 5 రోజుల పాటు కొనసాగనుంది. కాగా కొత్తగా ఇటీవల ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు నగరంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారని సమాచారం.

- సుమారు 800 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించేందుకు ఫీవర్ ఆస్పత్రికి అనుమతి ఇచ్చారు. ఈ పరీక్షలను ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, హెచ్‌ఓడీ డాక్టర్ కె. శంకర్, సీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ జయలక్ష్మితో పాటు ఓయూ ఏసీపీ సైదులు, నల్లకుంట సీఐ జగదీశ్వర్‌రావు పర్యవేక్షణలో నిర్వహించారు.
- ఈస్ట్‌జోన్ డీసీపీ సాయిశ్రీ ఈ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి కానిస్టేబుల్ అభ్యర్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని వైద్యులకు సూచించారు. కాగా మొదటి రోజు 79 మంది అభ్యర్థులు మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరైనట్లు సమాచారం.
- మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. ఆరు నెలల క్రితం పోలీసు కానిస్టేబుల్ రాత పరీక్షలో అర్హత సాధించి ఉద్యోగాలకు ఎంపికైన సుమారు 27 వేల మంది అభ్యర్థుల్లో సుమారు 800 మందికి మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి తమకు ఆదేశాలు వచ్చాయని చెప్పారు. ఈ మేరకు సోమవారం మెడికల్ పరీక్షలు ప్రారంభించామన్నారు. అభ్యర్థులకు ఐదు రోజుల్లో వైద్య పరీక్షలు పూర్తిచేసి రిపోర్టులను పోలీసు ఉన్నతాధికారులకు (డీసీపీ లేదా ఏసీపీ) అందజేస్తామని తెలిపారు.
- వైద్య పరీక్షల కోసం నాలుగు వైద్య బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కో బృందంలో ఒక వైద్యుడు, ముగ్గురు సహాయకులు ఉంటారని వివరించారు. అభ్యర్థుల ఆరోగ్య, వైద్యపరీక్షలకు సంబంధించిన రిపోర్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పొద్దని వైద్యులకు సూచించామని చెప్పారు.
- కంటి పరీక్షల్లో అభ్యర్థుల్లో ఎవరికైనా కలర్ విజన్, గ్లాకోమా, దృష్టి లోపం లాంటి సమస్యలు ఉన్నట్టు గుర్తిస్తే, అలాంటి అభ్యర్థులను ఆధునిక పరీక్షల కోసం సరోజిని దేవి కంటి ఆస్పత్రికి రెఫర్ చేస్తామని వివరించారు.
- బీపీ, షుగర్, ఈసీజీ, బ్లడ్, ఎక్స్ రే లాంటి పరీక్షలు తమ ఆస్పత్రిలో ఉన్న ఆధునిక పరికరాలతోనే పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో అవకతవకలకు తావు తేకుండా పోలీసు అధికారుల సమక్షంలోనే పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఫిట్‌నెస్ పరీక్షల కోసం వచ్చిన అభ్యర్థులకు తాగునీరు లాంటి వసతులను ఏర్పాటు చేశారు.

క్రైం కార్నర్..

రైల్లో బంగారం, నగదు అపహరణ

- ప్రయాణికుడి బ్యాగులోంచి ఎత్తుకెళ్లిన దుండగులు

కాచిగూడ: జైపూర్ రైల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి బ్యాగులోంచి బంగారు ఆభరణాలు, నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్‌లోని గంపూరి ప్రాంతానికి చెందిన కాశీప్రసాద్ సోని కుమార్తె నకుల్ సోని (52) జైపూర్ రైల్లో కాచిగూడకు వస్తుండగా.. మార్గం మధ్య మందకడ్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.40,500 నగదు, 1 గ్రాము బంగారు ఆభరణం, ఖరీదైన సెల్‌ఫోన్ కలిగిన బ్యాగును దొంగిలించారు. సోమవారం బాధితులు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేశామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ బీజీ ప్రసాదరావు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (60) మలక్‌పేట - కాచిగూడ రైల్వేస్టేషన్ల మధ్య రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని పెంపుడు కుక్కకు గాయాలు

- యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు

కాచిగూడ: కారు ఢీకొని పెంపుడు కుక్కకు తీవ్రగాయాలైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన రాహుల్ (26) సోమవారం బర్కత్‌పుర చౌరస్తా నుంచి కాచిగూడకు వెళ్తుండగా.. భూమన్నలైన్‌లో కాలనీవాసుల పెంపుడు కుక్కను కారుతో ఢీకొట్టాడు. దీంతో దాని తల, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా.. యజమాని మీనాకుమారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రూ. 55 లక్షలతో అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: నియోజకవర్గంలో రోడ్ల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట్ డివిజన్ ప్రేమ్‌నగర్‌లో రూ. 55 లక్షలతో సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అంతర్గత రోడ్డు మరమ్మతు పనులకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. రోడ్లతో పాటు పైపులైన్ వ్యవస్థ, పార్క్‌లు, వీధిలైట్లు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



సంఘీబావం తెలుపుతున్న బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీలో గతవారం రోజుల క్రితం రెవెన్యూ, జీహెచ్ఎంసీ విభాగం అధికారులు ఇళ్లను కూల్చివేశారు. బాధితులకు న్యాయం చేయాలని నిరాహార దీక్ష చేపట్టారు. సోమవారం ముఠా జైసింహ బస్తీ వాసులకు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు న్యాయం చేసేందుకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులతో మాట్లాడారని, కోర్టు పరిధిలో ఉండటంతో కూల్చివేతలను ఆపడం సాధ్యం కాలేదన్నారు. బస్తీలో 23 ఇళ్లలో 20 ఇళ్లను కూల్చివేశారన్నారు. బాధిత కుటుంబాలకు తాము అండగా ఉంటామన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, నాయకులు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, ఎంపీ.అశోక్, నితిన్, చాణిక్యరెడ్డి బస్తీవాసులు దినేశ్, ఎంబీ కృష్ణ, శ్రవణ్, బాల్‌రాజ్, జాన్, నరేష్, జ్ఞానేష్, ఆనంద్, కన్యాకుమారి, భారతి, సువర్ణ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బస్తీవాసులకు ఇళ్లు నిర్మించాలి..

స్వామి వివేకానందనగర్ బస్తీలో 75 ఏళ్లుగా ఉన్న పేదల నివాసాలను కూల్చిన చోటే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నగర్ మేయర్ , కమిషనర్లను డీబీబీఎఫ్ కోరింది. సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఇళ్లు నిర్మించే వరకు తాత్కాలిక షెల్టర్ ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

కేలండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న చక్రపాణి తదితరులు

కాచిగూడ: టీఎస్ఎస్‌పీడీసీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర కేలండర్‌ను సీజీఎం చక్రపాణి, సూపర్ ఇండెంటింగ్ ఇంజినీర్ రాంజీలు ఆవిష్కరించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీఎస్‌పీడీసీఎల్ జేఏసీ చైర్మన్ భాస్కర్, ఎ.రాములు, శశికాంత్, మైపాల్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, యాదాద్రి స్వామి, బ్రహ్మచారి, నాగిరెడ్డి, ప్రవీణ్ రాజు, సాయి, మోహన్‌కుమార్, మల్లయ్య, రమేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన డాక్టర్ బొమ్మర బోయిన లక్ష్మయ్యను సోమవారం రాష్ట్ర గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు శివరత్నం ఘనంగా సత్కరించి అభినందించారు. కాచిగూడ జూనియర్ కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణప్రదేశ్ గంగపుత్ర సంఘం, హైదరాబాద్ నగర గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు గంగపుత్ర సంఘం ప్రతినిధులు లక్ష్మయ్యను సత్కరించారు.



లక్ష్మయ్యను సత్కరిస్తున్న శివరత్నం

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోండి



డీఎంసీ మారుతి దివాకర్

అంబర్‌పేట్: ప్రజా సమస్యలను ప్రజావాణి దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చొరువ తీసుకుంటామని జీహెచ్ఎంసీ సర్కిల్-16 డీఎంసీ మారుతీ దివాకర్ తెలిపారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అన్ని విభాగాల అధికారులతో కలిసి ఆయన ప్రజావాణి నిర్వహించారు. సర్కిల్ పరిధిలో పేరుకుపోయిన చెత్తకుప్పలు రోడ్లపై మట్టికుప్పలు వంటి సమస్యలను ప్రజావాణి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. అధికారులు రజిత, జ్యోతిబాయి, వీరస్వామి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనపై కేబినెట్ నిర్ణయం చారిత్రాత్మకం

ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టడానికి కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బీసీ, ఎంబీసీ కులాల చిరకాల వాంఛ నెరవేరనుందన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టడంలో అణగారిన వర్గాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెరిగడంతో పాటు విద్య, ఉద్యోగ, ఆర్థికపరమైన వారి ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. కులగణన పూర్తైన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ, ఎంబీసీల సంక్షేమానికై ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం బడ్జెట్‌లో దామాషా ప్రకారం వివిధ కుల ఫెడరేషన్లకు బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లకు తగిన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సివరేజ్ పైపులైన్ నిర్మాణ పనులను సోమవారం జలమండలి డీఏం సన్యాసిరావు, ఏఈ భావన, వెంకటేష్‌యాదవ్‌లతో కలిసి కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ పరిశీలించారు. చెప్పల్‌బజార్ నుంచి నింబోలిఅడ్డ లాల్ బహదూర్ స్కూల్ వరకు పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె అధికారులను కోరారు. బీజేపీ నేతలు మల్లికార్జున్, వరలక్ష్మి, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్, సూరి తదితరులు పాల్గొన్నారు.

శతక పద్యాలను పిల్లలకు నేర్పించాలి



సంపుటిని ఆవిష్కరిస్తున్న రచయిత దాసరివెంకటరమణ

చిక్కడపల్లి: శతక పద్యాలను తల్లిదండ్రులు పిల్లలకు నేర్పించాలని రచయిత దాసరి వెంకటరమణ సూచించారు. యాముజాల కళా సమితి, రాగసప్తస్వరమ్ సంయుక్తాధ్వర్యంలో యాముజాల రామచంద్రన్ రచించిన శ్రీ వేంకటేశునికి పంచ సహస్ర రమణీయ కంద మందారమాల సంపుటిని సోమవారం చిక్కడపల్లి కార్యాలయంలో ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కలియుగదైవం వేంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ.. కందపద్యాలు రాయడం అభినందనీయమన్నారు. దూరదర్శన్ విశ్రాంత డీజీ అనంతపద్మనాభరావు, సంస్థ స్థాపకురాలు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ స్వామి కీర్తనలు అజరామరం



హరికథాగానం చేస్తున్న జిల్లా విశ్వనాథ జయరాములు

నల్లకుంట: త్యాగరాజ స్వామి కీర్తనలు అజరామరమని శ్రీరామ గానసభ కార్యదర్శి కొణికి శ్రీనివాసశర్మ అన్నారు. త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో సోమవారం సాయంత్రం సంగీత కచేరీ నిర్వహించారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన శ్రీనివాస శర్మ మాట్లాడారు. ఈ సందర్భంగా నేంద్రగంటి అలివేలుమంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్టు బృందంచే నిర్వహించిన త్యాగరాజ స్వామి కీర్తనలు ప్రేక్షకులను ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం ఎ.శివకృష్ణ స్వరూప్, కె. శశాంక్ ద్వయంచే నిర్వహించిన వయోలిన్ కచేరి అలరించింది. దీనికి మృదంగంపై సీహెచ్. రామకృష్ణ, తబలాపై గుణరంజన్, ఘటంపై చంద్రకాంత్ వాద్య సహకారం అందించారు. ఆరాధనోత్సవాలు ఈనెల 11వ తేదీతో ముగుస్తాయని గానసభ కార్యదర్శి సాయి శ్రీనివాసశర్మ తెలిపారు.

హరికథకులను కాపాడుకోవాలి..

హరికథా కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో హరికథా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఆర్ఎస్ అధికారి, ఏపీ రెగ్యులేటరీ కమిషన్ పూర్వ సభ్యుడు డాక్టర్ రఘు, గౌరవ అతిథి చారిత్రక నవలా చక్రవర్తి ఆచార్య ముదిగొండ శివ ప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం మాట్లాడారు. జిల్లా విశ్వనాథ జయరాములు భాగవతార్ 'శ్రీనివాస కల్యాణం' హరికథా గానం ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. చివరగా హరికథకులను అతిథులు శాలువాతో సన్మానించి సత్కరించారు. శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె. కృష్ణారావు, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్‌రావు, కార్యదర్శి మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.

పిల్లల అభిరుచి, ఆసక్తిని గుర్తించాలి



తులసి శిష్యబృందాన్ని సన్మానిస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి

చిక్కడపల్లి: పిల్లల అభిరుచి ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి అన్నారు. సోమవారం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో కళా లలిత కళావేదికలో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి జన్మదినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేషశయనారెడ్డి మాట్లాడుతూ రమణాచారి జన్మదిన వేడుకలను వివిధ సాంస్కృతిక సంస్థలు పండుగలా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వర్ధమాన కళాకారులు నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం నాట్యగురువు తులసిని సన్మానించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ జి.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయోద్యమంతో ప్రజల్లో చైతన్యం



నివాళులర్పిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి పద్మజ

చిక్కడపల్లి: తెలంగాణలో గ్రంథాలయోద్యమాన్ని నడిపించి ప్రజలను చైతన్య పరచిన మహనీయుడు వట్టికోట ఆళ్వారుస్వామి అని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ అన్నారు. సోమవారం రచయిత, పాత్రికేయుడు, గ్రంథాలయోద్యమకారుడు వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతి కార్యక్రమాన్ని చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ఆళ్వారుస్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.